# ముగ్గురు మిత్రులు

హాస్టల్ బయటకొచ్చి రంగాచారిపార్కు దాటి అరండల్ పేట రెండో లైన్‌లో నడుస్తున్నారు ముగ్గురు మిత్రులూ, మౌనంగా. ఎదురింట్లోనించి ఎవరో యుక్తవయస్సులోవున్న ఒకమ్మాయి ఎక్కడికో బయలుదేరి వెళ్ళటం చూచి...గిరి 'ఓ ప్రణయమయే ప్రియతమా,' అని పాట ప్రారంభించేప్పటికి గోపాలం గిరివేపు తీక్షణంగా చూట్టంతో అలా పాట్టం మానేశాడు. 'ఈమధ్య ఇలాంటి పాటలు పాడనని గోపాలం దగ్గర ప్రతిజ్ఞపూని మరల మొదలెట్టావేంరా?' అన్నాడు శీను. 'నాబుద్ధి గడ్డితిందిరా! క్షమించు గోపాలం!' అన్నాడు పాట మానేసి గిరి.

ముగ్గురూ మౌనంగా నడుస్తున్నారు; గోపాలం మీనాక్షి రాసిన ఉత్తరంలోని విషయాల్ని గుర్తుకు తెచ్చుకుంటున్నాడు. శీను ఆలోచనలు లేని మనస్సుతో నడుస్తున్నాడు! గిరి సినిమాల్లోని ప్రేయసీ ప్రియుల పాటల్నీ, విరహ గీతాల్ని విస్మరించుకుంటూ కొత్తగా కంఠస్థంచేసిన...ఆధునిక కవుల గేయాల్ని నెమరుకు తెచ్చుకుంటున్నాడు...

రెండో అడ్డరోడ్డు దాటిపోయింది. ముగ్గురూ నడుస్తున్నారు. గిరి ఒక్కసారిగా ప్రారంభించాడు—ఎదురుగా వున్న డాక్టర్ బోర్డుచూచి—

'బెదరమోకు సిస్టర్
టెంపరేచర్

తియ్యమోకు డాక్టర్
ప్రిస్క్రిప్షన్
పనికిరాదు మిస్టర్
ఈ రోగం ఇంతే
ఇంతేనండి మాస్టార్
చేతులు కడుక్కోవోయ్ మాష్టర్
ఏడవమోకు సిస్టర్
నాడి ఆడదు!'

పాటలు పాట్టం గిరికి సరదా. గంభీరంగావున్న గోపాలం ఒక్కసారిగా నవ్వేడు! శీను సరేసరి! పొద్దుతిరుగుడు పువ్వు! 'హిం! హిం!!' అనాడున్న.

గోపాలం నవ్వటం గిరికి సరదా ఇచ్చింది. 'భళానోయి భళి తమ్ముడూ; భళానోయి భళి దాదానా!' అని పాడుతూ గిరి శీను వీపుమీద దరువు వేస్తున్నాడు! శీను 'ఏడిశావు లేవోయ్!' అన్నాడు. గిరి ఆగిపోయాడు. కారణం హోటల్ దగ్గరించింది.

ముగ్గురూ 'మాధవ రెస్టారెంటులో ప్రవేశించారు. ముందు గోపాలం ఆ తరువాత శీను, ఆవెనక గిరి. ముగ్గురూ లోనికెళ్ళి మూడు కుర్చీలమీద ఆసీనులయ్యారు. సర్వరు వచ్చి బయట నిలబడ్డాడు. గిరి అతన్నిచూచి,

'లో! హాలో!
లోయలో
ఓ! ఓహో!
పటాలం

పటాలం!'—హోటల్లో ఏమేమి వున్నాయి?' అని ప్రశ్నించాడు. గోపాలం ఆలోచిస్తూనే వున్నాడు. శీను సరే సరి! గిరిలాగా తనకూ పాటలు కుర్తించుకునే శక్తి వుంటే బావుండునని ఆలోచిస్తున్నట్లు కనిపిస్తాడు.

మూడు గ్లాసుల్తో మంచినీళ్ళుమాత్రం అక్కడపెట్టి సర్వరు వెళ్ళిపోయాడు. గిరి మొదలెట్టాడు మరల–''Brainలో pain ప్రతి veinలో Machine-gun rain''

what is to be done?
what is to be done?''

గోపాలం చిరునవ్వు నవ్వి సర్వర్‌నుపిలిచి ఇడ్లీ, కార పొడి, నెయ్యీ ఆర్డరిచ్చాడు. 'ఇవన్నీ ఎప్పుడు కంఠస్థం చేశావురా?' అని ఆ ఉభయుల్లో ఎవరూ అడగలేదు. వాళ్ళకు తెలుసు - వీడు కాలేజీలో వెనకబెంచీమీద కూచొని చేసే ఘనకార్యమేమిటో! పైగా ఇటీవలే ''కాలేజి డే''సందర్భంలో ఎవరి పాటనో తనపాటగా చెలామణిచేసి అందర్నీ ఆశ్చర్యంలో ముంచేశాడు.

'ఇడ్లీకి కొంచెం ఆలస్యముంది. వాయి తీయాలి' అన్నాడు సర్వరు.

మరల మౌనం.

ఈసారి మౌనాన్ని గోపాలం భంగంచేశాడు.'మీనాక్షి ఉత్తరం రాసిందిరా.' అన్నాడు. 'నిజంగానా? ఎప్పుడు? ఏమంటోంది?' అని అడిగాడు గిరి. జేబులోంచి ఉత్తరం తీసి గోపాలం గిరిచేతి కిచ్చాడు.

'ప్రియమైన గోపాలానికి,

మీనాక్షి వ్రాయు ప్రేమలేఖ. నీ ఉత్తరం అందింది. క్రిందటి నెలలో ఫొటోలు తీయించుకునే నిమిత్తం పంపిన ఏభై రూపాయలు ఫొటోలకోసమే వినియోగించినందుకు సంతోషం.

'ఫొటోలేమిటిరా గోపాలం?'

'నువ్వు చదవ్వోయ్ ముందు'

'నా హృదయఫలకంమీదఎల్లవేళలా నీ రూపే నాట్యమాడుతూ కన్పిస్తుంది. అయినా నా నయనాలు నీ ముఖారవిందాన్ని వీక్షించే నిమిత్తం ఆతురత చెందుతున్నాయి. కనుక నువ్వు తీయించుకున్న ఫొటో ఒకటి నాకు పంపించు.

'ఈ నెల మొదటి వారంలో పంపిన వందరూపాయలు కూడా నీకు చేరేవుంటాయి. నీవు జబ్బుపడి హాస్పిటల్‌లో వున్నావని తెలుసుకున్నప్పుడు నా హృది ఎంతగారోదించిందో మాటలద్వారా వ్యక్తంచేసేందుకు అసమర్థురాలిని. నానిరీక్షణ ఎప్పటికయినా ఫలిస్తుందని నా ఆశ. మా అమ్మపోయిననాటి నుంచి మా నాన్నకు నేనంటే ఎంతో ప్రేమ. నే నడిగినప్పుడల్లా డబ్బిస్తాడు. 'ఎందుకు' అని అడగడు. నా పెళ్ళి చేసేందుకు సకల ప్రయత్నాలూ చేసి విఫలుడయ్యాడని నీకు తెలుసుగా? ఈ సంఘపు కట్టుబాట్లు చాలా విచిత్రమైనవి. మా నాన్నకు ధైర్యంచెప్పాను. నీ విషయం నెమ్మదిగా చెబుతాను.

"నీవు హాస్పిటల్ నుంచి 'డిస్‌చార్జి' అయి హాస్టల్‌కు వచ్చావని నీ ఉత్తరంద్వారా తెలుసుకున్నా. శక్తివచ్చేందుకు

టానిక్స్ వగైరాలకు వందరూపాయలు ఈ ఉత్తరంతోపాటే పంపిస్తున్నా. ఉత్తరం వ్రాయి.
నీ ప్రియమైన
—మీనాక్షి

గిరి ఉత్తరం చదివి గోపాలానికందిస్తూ 'నువు చాలా అదృష్టవంతుడవోయ్!' అన్నాడు.

'ఎందుకని?'

'ఎందుకంటే? మీనాన్న పంపిన డబ్బుతో కాలేజీ ఫీజూ, హాస్టల్ డ్యూసూ చెల్లించేస్తున్నావు. నిక్షేపంగా మీనాక్షి పంపించే పైకంతో జల్సాచేస్తున్నావు. మేమంతా నానా యాతనలు పడుతున్నాం. నాపేరు కాలేజీ నోటీస్ బోర్డు మీదా, హాస్టల్ నోటీసుబోర్డుమీదా వుంది-ఫలానా తారీఖు నాటికి పైకం చెల్లించకపోతే అక్కడ కాలేజీలోనూ, ఇక్కడ హాస్టల్‌లోనూ పేరు సఫా అవుతుంది. అటు చదువూ నాస్తి. ఇటు అన్నమూ సున్నా. నేను 'భావిలేని భవిష్యత్తు, రేపులేని రేపులకై' ఎదురు చూస్తున్నా. ఇక్కడ మా జీవితాలు వడ్డించిన విస్తర్లలా వున్నాయి. శీను సంగతి చెప్పేదేముంది? నువు పచ్చగా వుంటే వాడూ అంతే. ఇక నేనే బడుద్ధాయిని.'

ఇడ్లీలు వచ్చాయి. గోపాలం గిరివేపుచూచి నవ్వుతూ సర్వర్‌కు దోసెలకు ఆర్డరిచ్చాడు. 'బడుద్ధాయిలాగా బాధ పడక ఇడ్లీలు తిను.'

ప్లేటు ముందుకు లాక్కుంటూ గిరి అన్నాడు—'నువ్వు క్రిందటి నెలలో ఫొటోలు తీయించుకోలేదు. ఈ నెలలో జబ్బు పడనూలేదు. టానిక్కుల పేరుతో మరో వంద వస్తున్నాయి. నిజంగా నన్నడిగితే ఇది మోసంకదూ!'

శీనుకు అవకాశం దొరికింది. 'ఏడిశావులేరా! కాఫీ హోటళ్ళకూ, సినిమాలకూ, పార్కుషికార్లకూ గోపాలం వెంట నంగి నంగి వస్తావు. అప్పుడు నీకు ఏ చింతావుండదు. ఇప్పుడు నీకు దీంట్లో మోసం కన్పించిందా! గోపాలం మీనాక్షిని పెళ్ళిచేసుకుంటాడు. ఆ పిల్ల డబ్బు పంపిస్తున్నది.'

'నువ్వు నోరుమూసుకోరా!' అన్నాడు గిరి. శీను నోరు మూసుకున్నాడు. గోపాలం నవ్వుతున్నాడు.

సర్వరు దోసెలు తీసుకొచ్చాడు. గిరి మరల ప్రారంభించాడు—'నీకొచ్చే వందలో నాక్కొంచెం పైకం సర్దాలి కనీసం హాస్టల్ డ్యూసయినా చెల్లిస్తే తిండికి లోటుండదు. కాలేజి ఫీజు విషయం తరువాత చూడొచ్చు.

గోపాలం దీనికికూడా నవ్వాడు 'ఎంతచెట్టుకు అంతగాలి. ఈ వందలో కాని ఖర్చుచేయటానికి వీల్లేదు... అలాగే తీసుకెళ్ళి బట్టలషాపులో జమకట్టాలి!'—

దోసె తినటం ఆపేసి గిరి అనునయ భంగిమలో అన్నాడు- 'గోపాలం. యింకోపని చేయగూడదూ?'

'ఏమిటి?' అన్నాడు గోపాలం. దోసె తింటూనే శీను ఎప్పుడో తినేశాడు. పచ్చడి నాకుతున్నాడు.

'నేను హాస్పిటల్‌నుంచి డిస్‌చార్జి అయివచ్చానని, కాని జబ్బు మరల మూడురోజులకే తిరగబెట్టిందనీ, ఇంజెక్షన్లకూ వాటికి డబ్బుకావాలనీ మీనాక్షికి రాస్తూ ఇంకోవంద పంపించమని రాయరాదూ?' అన్నాడు గిరి.

గోపాలం ఉగ్రుడయ్యాడు. అప్పుడే సర్వరొచ్చి నిలబడ్డాడు. శీను మూడు కాఫీలకు ఆర్డరిచ్చాడు.

'నీకు బుర్ర లేదురా గిరీ! నీకోసం నన్ను అబద్ధా లాడమంటావా? ఇలాంటి వెధవ ప్రసంగా లిక నా దగ్గర చేయకు.'

శీను ఏదో మాట్లాడాలి గనుక మాట్లాడాడు — 'నీ కోసం గోపాలాన్ని అబద్ధాలు ఆడమంటావు! మోసంచేసి డబ్బు తెప్పించమంటావు — అంతేనా?"

'నువ్వు నోరుముయ్యరా' అన్నాడు గిరి. అప్పుడే సర్వరు కాఫీలు తెచ్చి, బిల్లు మధ్యలోపడేసి వెళ్ళిపోయాడు.

'ఏం, నోరుముయ్యకపోతే?' అన్నాడు గోపాలం.

గిరికికూడా కోపంవస్తోంది. 'ఏంలేదు, నిన్ను ఒక ఆదర్శ యువకునిగా చిత్రించనీయమంటావు! ఒక వేపున ఆ పిల్లను పెళ్ళిచేసుకుంటానని దగాచేస్తున్నావు! డబ్బు గుంజుతున్నావు! నువ్వు ఆ పిల్లను ఎప్పటికీ పెళ్ళిచేసుకోవు. నీ స్వలాభం నాకు తెలుసు. మనుషుల్ని మోసంచేస్తూ నలుగురి మధ్య సిల్కు సూట్లలో ట్వీడ్ పాంటులలో ఆదర్శంగా, గొప్ప వాడికిమల్లే కన్పించటానికి నటన చేస్తున్నావు! ఇదంతా మోసం! పచ్చిమోసం!' అంటూండగానే గోపాలం లేచి గిరి దవడమీద లాగి రెండు దెబ్బలు వేశాడు. గిరి దిమ్మతిరిగి పోయాడు. గిరి గోపాలం చొక్కా పుచ్చుకొని పొత్తికడుపు మీద గుద్దేడు.

శీను గిరిని పట్టుకున్నాడు. గోపాలం గిరిని పచ్చడి పచ్చడిగా తన్నేడు. సర్వర్లూ, కాఫీలు తాగేవాళ్లూ

హోటలు ప్రొప్రయిటరూ పరుగెత్తుకుంటూ వచ్చి తన్నుకో టాన్ని నివారించారు.

బల్లమీదవుంచిన గాజుగ్లాసులు పప్పుపప్పు అయ్యాయి. కాఫీ ముగ్గురి గుడ్డలమీదా చిందింది. గిరి తింటూన్న దోసె అల్లంత దూరాన ఎగిరిపడింది. శీనుచొక్కాకు పచ్చడి అంటుకుంది. బల్లమీదవున్న మంచినీళ్ళ గ్లాసులూ, ప్లేట్లూ అన్నీ చిందరవందర అయ్యాయి.

ప్రొప్రయిటరు పగిలిన గాజుగ్లాసులవేపు చూసి ఏడుపు మొహంపెట్టాడు! వెంటనే ఏదో భయంకూడా ఆవరించింది అతన్ని. ఆ ముగ్గుర్నీ అతను తన హోటల్లో సంవత్సరం నుంచి నియమంగా వచ్చి తినటం చూచాడు. ఆ కారణంగా ఏమీ మాట్లాడటం భావ్యం కాదనుకున్నాడు. గోపాలం క్రిందపడివున్న బిల్లు తీసుకొని డబ్బుచెల్లించి హోటలుమెట్లు దిగేడు. గోపాలం, గోపాలంవెనక శీనూ, ఆవెనక గిరీ! అక్కడి జనం విడ్డూరంగా చూస్తున్నారు.

గోపాలం కిళ్ళీకొట్టుదగ్గర కెళ్ళి మూడుకిళ్ళీలూ, మూడు సిగరెట్లూ తీసుకొని శీనుకూ, గిరికీకూడా ఒక్కొక్కటి ఇచ్చాడు! మరల ముగ్గురూ హాస్టలువైపు బయలుదేరారు.

ముగ్గురూ మౌనంగా నడుస్తున్నారు. రెండో అడ్డ రోడ్డు దాటి, రంగాచారి పార్కు సమీపిస్తున్నచోట...... గోపాలం గిరిభుజంమీద చెయ్యివేసి 'కోపం వచ్చిందా ?' అన్నాడు.

శీను సిగరెట్టుదమ్ము లాగుతూ అన్నాడు— 'దీంట్లో ఏముంది. కోపం రావటానికి !'

గిరి ఉబ్బిన దవడను సరిచేసుకుంటున్నాడు! బాధలో కూడా వా డన్నాడు 'నా కెందుకు నీ మీద కోపం ? ఇది మామూలేగా !' అని.

హాస్టలు సమీపిస్తున్న సమయాన గిరి పెదాలు...... దేన్నో ఉచ్ఛరించాయి—

"మనమంతా బానిసలం
గానుగలం, పీనుగలం
వెనుక దగా, ముందు దగా
కుడి యెడమల దగా దగా !"

ముగ్గురు మిత్రులూ హాస్టల్లో ప్రవేశించారు.

# అసమానంతర రేఖలు

బుచ్చిరామయ్య పేరు వినటంతోనే నాకు నవ్వొస్తుంది. కారణం ఆయన పేరే. కాని మరుక్షణంలో వచించేందుకు వలనుపడని ఉద్వేగం నా హృదయాన్ని చుట్టుముడుతుంది. దీనికి కారణం, ఆయన అనుసరించిన విధానం కావచ్చు.

♦ ♦ ♦ ♦

'ఈయన పేరు బుచ్చిరామయ్య' అని బెజవాడ గవర్నర్ పేట సెంటర్ లో వెంకటేశ్వర్రావు ఆయన్ని పరిచయం చేసినప్పుడు నేను లోలోపల నవ్వుకున్నాను—'ఇదేం పేరు' అని. బహుశా ఈ బెజవాడపట్నంలోనే ఈయన ఏ